

భక్తిశ్రద్ధలతో ధ్వజపట లేఖనం

- హాజరైన దేవనాథ జీయర్‌స్వామి
- నేడు భద్రాద్రిలో ధ్వజారోహణం

భద్రాచలం, ఏప్రిల్ 14: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజపట భద్రక మండల లేఖనం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తెల్లని వస్త్రంపై గరుత్మంతుడి చిత్రాన్ని చిత్రీకరించి స్థానిక జీయర్‌మఠంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పటాన్ని చిత్రీకరించిన కె.రఘునాధాచార్యులను దేవస్థానం తరఫున ఘనంగా సత్కరించారు. అనంతరం భాజభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజాన్ని రామాలయానికి తీసుకెళ్లారు. సోమవారం ధ్వజారోహణం నిర్వహిస్తుండగా గరుత్మంతుడి చిత్రపటానికి గరుడాధివాసాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సమయంలో గరుత్మంతుడిని ఆవాహన చేసి గరుడ సంబంధమైన స్థానంలో మూర్తి ఆవాహన నిర్వహించారు. అంతకు ముందు పటాన్ని రామయ్య సన్నిధానం వద్దకు తీసుకెళ్లి చిత్ర లేఖనంలో తెలిసీ తెలియక ఏమైనా దోషాలు జరిగితే చల్లని చూపుతో ఆ దోషాలను తొలగించి అనుజ్ఞ ఇవ్వాల్సిందిగా రాములవారిని ప్రార్థించారు. అనంతరం యాగశాలకు ధ్వజపట్టాన్ని తీసుకెళ్లి అదివాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవనాథ జీయర్ స్వామి, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సంతాన ప్రాప్తిని కోరే మహిళలకు గరుడ ప్రసాదాన్ని అందజేయనున్నారు.

మందకొడిగా టికెట్ల విక్రయాలు

శ్రీరామ నవమిరోజు భద్రాచలంలో నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు భద్రాద్రి దేవస్థానం అందుబాటులో ఉంచిన టికెట్ల విక్రయాలు మందగొడిగా సాగుతున్నాయి. మొత్తం 15,860 టికెట్లు అందుబాటులో ఉంచగా ఇప్పటివరకు కేవలం 3,299 టిక్కెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఇంకా 12,561 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో 11,190 టికెట్లు అందుబాటులో ఉంచగా 2,363 టికెట్లు ఇప్పటివరకు అమ్ముడయ్యాయి ఇంకా 8,827టికెట్లు ఆన్‌లైన్‌లో భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో మొత్తం 4,670టికెట్లు అందుబాటులో ఉండగా 936టికెట్లు ఇప్పటివరకు అమ్ముడయ్యాయి ఇంకా 3,299 టికెట్లు భక్తులకు అందుబాటులో ఉన్నాయి.



ధ్వజభద్రుక పటానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మన్యం గడగడ



మావోయిస్టు పార్టీ ఐదు రాష్ట్రాల బంద్ పిలుపు నేపథ్యంలో మన్యం గడగడ వణుకుతోంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లతో తీవ్రంగా నష్టపోయిన మావోయిస్టులు ఆయా ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ సోమవారం ఐదు రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో అలజడి మొదలైంది. పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా భద్రాద్రి, ములుగు జిల్లాల్లోని ఇసుక ర్యాంపులను మూసివేశారు. అభివృద్ధి పనులను నిలిపివేశారు. హిట్‌లిస్టులో ఉన్న వారిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో పోలీసు బలగాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి.

వరుస ఎన్‌కౌంటర్లపై మావోయిస్టు పార్టీ నిరసన

- నేడు ఐదు రాష్ట్రాల బంద్‌కు పిలుపు
- అప్రమత్తమైన భద్రాద్రి జిల్లా పోలీసులు
- అభివృద్ధి పనులు, ఇసుక ర్యాంపుల మూసివేత
- సాయంత్రం ఏజెన్సీకి ఆర్టీసీ బస్సుల నిలిపివేత
- చర్ల ప్రాంతంలో విస్తృత తనిఖీలు
- సరిహద్దు అడవుల్లో కూంబింగ్ ముమ్మరం

చర్ల, ఏప్రిల్ 14: దండకారణంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లకు నిరసిస్తూ సోమవారం మావోయిస్టు పార్టీ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ టెన్షన్ వాతావరణం నెలకొంది. ఐదు రాష్ట్రాల బంద్‌కు పిలుపునిస్తూ కొద్ది రోజుల క్రితం మావోయిస్టు పార్టీ సెంట్రల్ రీజనల్ బ్యూరో సెంట్రల్ కమిటీ ప్రతినిధి ప్రతాప్ పేరిట లేఖ విడుదల చేసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఆంధ్రాలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, ఏవోబీ సరిహద్దుల్లో అంతా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ఆయా జిల్లాల్లో ప్రత్యేక బలగాలు గత రెండు రోజులుగా అడవుల్లో గాలింపు ముమ్మరం చేశాయి. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లోని ఇసుక క్వారీలను మూసి వేశారు. హిట్ లిస్టులో ఉన్న వారిని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు నిలిపివేశారు. సాయంత్రం వేళల్లో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను నిలుపుదల చేశారు.

అడవుల్లో కూంబింగ్ ముమ్మరం

మావోయిస్టు బంద్ నేపథ్యంలో ఐదు రాష్ట్రాల్లోని సరిహద్దు అడవుల్లోకి గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, సీ-65, బలగాలు చొచ్చుకుపోతున్నాయి. మావోయిస్టుల కోసం అణువణువుగా గాలిస్తున్నాయి. అడవుల్లో అనుమానాస్పదంగా కనిపించిన వారిని ప్రశ్నిస్తున్నారు. వేలమంది బలగాలు అడవుల్లోకి చొచ్చుకుపోతుండడంతో సమీప గిరిజనులు భయంతో వణికిపోతున్నారు. అలాగే మావోయిస్టు ప్రాబల్యం అధికంగా ఉన్న చర్ల మండలంలోనూ తనిఖీలు ముమ్మరం అయ్యాయి. చర్ల సీఐ రాజువర్మ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు టీవీఆర్. సూరి, నర్సిరెడ్డిలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరిహద్దుల్లోని అన్ని రహదారులను ఆధీనంలోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వారి వివరాలు తెలుసుకుంటున్నారు. కల్వర్టుల వద్ద భద్రత పెంచారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేస్తున్నారు.

ఇసుక క్వారీల మూసివేత

బంద్ నేపథ్యంలో మావోయిస్టులు విధ్వంసకర ఘటనలకు పాల్పడవచ్చనే అనుమానంతో అధికారులు ఇసుక క్వారీలు మూసివేశారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెంలోని చర్ల, దుమ్ముగూడెం, ములుగు జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, మండలాలోని క్వారీలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవద్దని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుక లారీలు రాకుండా మూడు రోజుల పాటు ఇసుక అమ్మకాలు నిర్వహించవద్దని టీఎస్‌ఎండీసీ అధికారులు సైట్‌లో సమాచారం ఉంచారు. అలాగే ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టవద్దని ఆదేశించారు. పనుల వద్ద ఎలాంటి వాహనాలు ఉంచొద్దని సూచించారు.

హిట్ లిస్టులో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు

మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్న వారిని అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే వారికి లిఖితపూర్వకంగా సూచనలు చేసినట్లు తెలుస్తోంది. అందులో మావోయిస్టులు దాడులు చేసే అవకాశం ఉందని, పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు అందులో పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. కొద్ది రోజులపాటు చాలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు వినికిడి. చాలా మంది ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నట్లు తెలుస్తోంది.

అంబేద్కర్ స్ఫూర్తితోనే ప్రజాపాలన

- ఆయన ఆశయాల సాధనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- రాజ్యాంగ రక్షణతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ
- జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలన అందిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, లక్ష్యాల సాధన కోసమే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే దేశంలో ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు ఏర్పడ్డాయన్నారు. అంబేద్కర్ ఆలోచన మార్గంలో నడవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోనేందుకు కాంగ్రెస్ శ్రేణులు నడుం బిగించి కదలాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా పేదల సంక్షేమానికి పని చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేశామన్నారు.

అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ తమ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనపై విమర్శలు గుప్పించారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అక్రమాలన్నీ వెలికితీస్తామన్నారు. వారు చేసిన అక్రమాలే వారికి శూలాలై గుచ్చుకోవడం ఖాయమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వందరోజులు పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ పెద్దలు అవాకులు చవాకులు పేలడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వంలో యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టు పనులు ఇష్టానుసారంగా నామినేషన్ పద్ధతిపై ఇచ్చారన్నారు. అనాలోచితంగా దుర్బుద్ధితో గత పాలకులు యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు మొదలు పెట్టారని ఆరోపించారు. వారి నిర్వాకం వల్ల ప్రాజెక్టు వ్యయం రూ.35వేల కోట్లకు పెరిగి ప్రభుత్వానికి గుదిబండగా మారిందన్నారు. పదేళ్ల పాలనలో రూ.7లక్షల కోట్ల అప్పులు చేసిన బీఆర్‌ఎస్ పాలకులు ఇప్పుడు నీతిసూత్రాలు వల్లించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇకపై ప్రతి ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు కార్యాలయంలో అందరినీ కలుస్తానని తెలిపారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్, రాయల నాగేశ్వరరావు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్‌చౌదరి, మలీదు వెంకటేశ్వర్లు, బాలగంగాధర్ తిలక్, వడ్డెబోయిన నరసింహారావు, వైరా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

అంబేద్కర్‌కు మంత్రి తుమ్మల నివాళి

ఖమ్మం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మంత్రి తుమ్మల వెంట మిక్కిలినేని నరేంద్ర పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల సాకారమవుతున్న వేళ

- భద్రాచలం గోదావరిపై రెండో వారధి సిద్ధం
- శ్రీరామనవమికి సేవలు ప్రారంభం
- నేడు ట్రయల్‌రన్
- మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల

భద్రాచలం ఏప్రిల్ 14: భద్రాచలం ప్రజల దశాబ్దాల కల సాకారం కాబోతోంది. భద్రాచలం-సారపాక మధ్య గోదావరిపై రెండో వారధి సిద్ధమైంది. 2015లో కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, బండారు దత్తాత్రేయ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదగా శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతేడాది డిసెంబర్‌లో తుమ్మల మళ్లీ మంత్రి హోదాలో భద్రాచలం వచ్చి రెండో వారధిపై ప్రత్యేక పెట్టారు. శ్రీరామనవమి నాటికి వారధి ప్రారంభం అవుతుందని భద్రాద్రి వాసులకు మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి చేయించారు. దీంతో 17న జరుగనున్న శ్రీరామనవమి వేడుకకు భద్రాద్రి వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అదేరోజు ఈ బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సోమవారం బ్రిడ్జిపై ట్రయల్‌రన్‌ను నిర్వహించనున్నారు. దాంతో దశాబ్ద కాలంగా రెండో బ్రిడ్జి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటను నెరవేర్చిన మంత్రి తుమ్మలకు భద్రాద్రివాసులు, పార్టీలకు పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. భవిష్యత్తులోనూ భద్రాద్రి అభివృద్ధికి మంత్రి ఇదేవిధంగా సహకరించాలని వారు అభ్యర్థిస్తున్నారు.





మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఫోన్ ట్యాపింగ్ నేతలకు చిప్పకూడు తప్పదు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా, ఏప్రిల్ 14: గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన నేతలు త్వరలో జైలు ఊచలు లెక్కపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధ్యక్షతన ఆదివారం జరిగిన నియోజకవర్గస్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక కమిటీ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ చేసిన నేతలపై రాబోయే రోజుల్లో చట్టపరమైన చర్యలు ఉంటాయని, వారికి చిప్పకూడు తప్పదని హెచ్చరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నేతలు కాంగ్రెస్ పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేసి అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించి ప్రజాపాలన అందిస్తున్నామన్నారు. ప్రాజెక్టుల పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలోని మంత్రులు సైతం భూకబ్జాలకు పాల్పడ్డారని, వారికి తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లో నలుగురి అరెస్టు

- అందులో ఇద్దరు మైనర్లు
- 13,260 నగదు స్వాధీనం

6





బోరుబావి నుంచి నీటిని నేలబావిలో నింపుతున్న దృశ్యం

అడుగంటిన నేలబావులు

- పడిపోయిన భూగర్భ జలం
- పాడి పోషణ, గృహ అవసరాలకు తప్పని కష్టాలు
- కల్లూరు మండలంలో అల్లాడుతున్న పల్లె జనం

6

చర్చోపచర్చలు!

- హైదరాబాదులో కేసీ వేణుగోపాల్‌తో జిల్లా నేతల సమావేశం
- అయినా కొలిక్కిరాని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక వ్యవహారం

ఖమ్మం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది ఇంకా తేలలేదు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహాలపై అభ్యర్థులతోపాటు ఆయా నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్ మంత్రులతో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలోనూ ఖమ్మం అభ్యర్థి అంశం కొలిక్కి రాలేదు. ఈ సమావేశానికి జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులపై చర్చ జరిగినట్టు తెలిసింది. పెండింగ్ స్థానాల అభ్యర్థుల ఎంపికపై చర్చ జరిగినా అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం తీసుకోలేదు. దాంతో ఈ వ్యవహారం మళ్లీ ఢిల్లీకి చేరింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సోదరుడు ప్రసాదరెడ్డికి టికెట్ ఇవ్వాలని గట్టిగా పట్టుబడుతున్నారు. ఈ సీటు కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, మల్లు నందిని, కాంగ్రెస్ నేతలు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర స్థాయిలో మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు పేరు కూడా పీసీ పరిశీలనలో ఉండడంతో కేసీ వేణుగోపాల్ అందరి అభిప్రాయాలు తీసుకుని ఢిల్లీ వెళ్లిన తర్వాత మరో రెండు రోజుల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బౌరం క్యా పార్క్, జనరల్4/1,TTC,థానే బేలాపూర్ రోడ్,మున్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము **తేది. 24.04.2024** నాడు వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో దేనినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
MARPDPJ2310030002	RAVI ERROJU	WYRA3PJ2310200004	KURAPATI ACHYUTHA RAMARAJU
WYRA3PJ2310030007	LAXMI BULLA	WYRA3PJ2310200001	RAMAIAH KURISETY
AWRPTPJ2310040011	GODE LAXMI KUMARI	MARPDPJ2307210002	TURAKA LINGAIAH
AWRPTPJ2310040012	GODE LAXMI KUMARI	MGURUIP2301230001	PATNALA SAI KUMAR
MGURUPJ2310040008	NAGALAXMI YETHARI	WYRA3PJ2310240003	SRIRAMULU VEMULA
WYRA3PJ2310040005	KRISHNA ANUMOLU	MARPDPJ2307240015	BHUKYA SRINU
MARPDPJ2307050008	BALU BHANOTH	WYRA3PJ2307250006	KONDULA NAGAMANI
YLNDUPJ2310090025	KRISHNA MADE	WYRA3PJ2307250007	MODUGU PULLAIAH
WYRA3PJ2310090011	BALNE RAMU	KHMM3PJ2310260003	MALSOOR NARLA
KHMMAPJ2307110001	DHARAVATH KRISHNA	KHMM3PJ2310260002	MALSOOR NARLA
MARPDPJ2307110001	VODELA SUDHA	PLVCHPJ2310280005	RAAJAANI MURALI
MARPDPJ2307110005	ESARAPU DURGAIAH	KHMM3PJ2310290001	MALSOOR NARLA
KTGDMPJ2307120001	CHENELLI KEERTHAN	WYRA3PJ2310300010	KURAPATI ACHYUTHA RAMARAJU
MARPDPJ2307120007	HARI JERPULA	MDHR1PJ2310310002	DANTALA SIVA SANKARA RAO
MARPDPJ2307130005	KOTA UPENDAR	MARPDPJ2307310009	IRUGU LAKASHMAIAH
MARPDPJ2307140002	VIJAYA GUGULOLTHU	WYRA3PJ2310310005	MAREEDU DEVENDRA
STPLIPJ2310140003	INAPALA LAXMI PRASANNA	PLVCHPJ2301310004	KASARLA PADMA / VEERABHADRA CHARY
MARPDPJ2307170002	SUMAN BHUKYA		
MDHR1PJ2310180001	HAREESH MARABATTULA		
WYRA3PJ2310180007	BALNE RAMU		
WYRA3PJ2310190002	RAMAKRISHNA PASUPULAETI		
WYRA3PJ2310200010	BALNE RAMU		

క్రింద ఉదహరించిన చిరునామా వద్ద వేలం వేయడం జరుగుతుంది: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం.11-4-12/15, ఎస్.బి.ఐ బిల్డింగ్,2 వ అంతస్తు,వైరా రోడ్ ఖమ్మం . వేలం సమయం: 11.00 AM ,మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ ఎం.సురేష్ కుమార్ ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 15.04.2024
స్థలం: ఖమ్మం

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆదాయం, ఖర్చు సమానం

- భారీగా పెరిగిన ఆదాయం
- 2023-24లో రూ.55,45,43,162.84 ఆదాయం
- రూ.51,36,46,521.96 వ్యయం

భద్రాచలం, ఏప్రిల్ 14: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వార్షిక ఆదాయం గత ఆర్థిక సంవత్సరంలో భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి భద్రాద్రి దేవస్థానం ఆదాయం రూ.55,45,43,162.84 వచ్చింది. కాగా అదే రీతిలో ఖర్చు రూ.51,36,46,521.96 అవడం గమనించదగ్గ విషయం. 2022 -23

ఆర్థిక సంవత్సరం	ఆదాయం(రూ.)	వ్యయం(రూ.)
2019-20	33,89,21,303.70	34,41,35,535.23
2020-21	26,73,97,312.46	24,63,82,773.57
2021-22	26,53,16,522.67	28,40,13,501.83
2022-23	38,15,63,483.89	37,74,90,140.41
2023-24	55,45,43,162.84	51,36,46,521.96



ఆర్థిక సంవత్సరంలో రూ.38,15,63,483.89 ఆదాయం రాగా రూ.37,74,90,140.41 ఖర్చయ్యింది. భద్రాద్రి దేవస్థానానికి ప్రధానంగా ఆర్జిత సేవలు, భక్తుల నుంచి వచ్చే కానుకల ద్వారా మాత్రమే ఆదాయం సమకూరుతుంది. అయితే ఇందులో ప్రధానంగా ఇందులో జీతాలకే ప్రతి నెల రూ.కోటి మేరకు వెచ్చించాల్సి వస్తుంది. విద్యుత్తు బిల్లుల చెల్లింపు వసతి గృహాలు, సత్రాలు నిర్వహణ ఇతరత్రా ఖర్చులకు భారీ ఎత్తున చెల్లింపులు చేయా ల్సి వస్తోంది. ఇదిలా ఉండగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత నిత్యాన్నదాన సత్రానికి 2019-020లో రూ.14,57,72,284.48 ఆదాయం రాగా రూ.14,33,23,298.48 ఖర్చయింది. 2022-23లో రూ.16,26,37,152.33 ఆదాయం రాగా, రూ.16,59,67,373.47 వ్యయమైంది. 2023-24లో రూ.24,01,02,039.53 ఆదాయం రాగా రూ.23,49,97,341.88 వ్యయమైంది.

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం

ఎర్రుపాలెం ఏప్రిల్ 14: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు ఆదివారం ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారికి సుప్రబాతసేవ, ప్రాత:కాల అర్చనలు, సహస్ర నామ అర్చనలు అనంతరం వివాహం ముందుగా నిర్వహించే స్నాతకం క్రతువును నిర్వహించారు. సాయంకాలవేళ మంగళ వాయిద్యములు, మేళ తాళాలు, కోలాట నృత్యాలతో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని చంద్రప్రభ వాహనంపై గిరి ప్రదక్షణ గావించారు. కీలక ఘట్టమైన శ్రీవారి కళ్యాణం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఖమ్మం నగరానికి చెందిన తుశ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతుల సహకారంతో తెప్పోత్సవం ఆహ్లాదంగా సాగనుంది.

గాన సేవలో గంధర్వ త్రయం



కీర్తనలు ఆలపిస్తున్న మంగళంపల్లి బాలమురళీకృష్ణ(ఫైల్)



నవరత్న కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం(ఫైల్)

- భక్తరామదాసు కీర్తనలకు జీవం పోసిన మహనీయులు
- వీరి గానామృతం ఎంతో మందికి ప్రేరణ

భద్రాచలం, ఏప్రిల్ 14: భగవంతుణ్ని చేరుకోవాలంటే మనకి తొమ్మిది రకాల భక్తి మార్గాలు నిర్దేశించబడ్డాయి. వాటిలో కీర్తన భక్తి మార్గం ఒకటి. దీనిని అనుసరిస్తూ ఎంతో మంది వాగ్గేయకారులు భగవంతుని అనుగ్రహాన్ని పొందారు. ఆ కోవలోనే పయనించిన వారు భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి సేవలో తరించిన వారు భక్తరామదాసు, శ్రీ తూము లక్ష్మీనరసింహదాసు. ఈ దాస ద్వయం కూడా రామున్ని సేవిస్తూ కీర్తనలు కూడా రచించి తరించినటువంటి వాగ్గేయకారులు. వీరి గానామృతం ఎంతో మందికి ప్రేరణ కలిగించింది. త్యాగరాజస్వామి వారు కూడా భక్తరామదాసు ఆలపించిన కీర్తనలను పాడుకొని తము రాసిన కీర్తనల్లో కూడా రామదాసును కీర్తించారంటే తరువాత ఉన్న రామ భక్తులపై వీరి ప్రభావం ఎంత ఉందో మనం అవగతం చేసుకోవచ్చు. అలాగే రామదాసు కీర్తనలను పాడుకోని రామభక్తుడంటూ ఉండరు. అటువంటి కీర్తనలకు తమ గళం ద్వారా ప్రాచుర్యం కల్పించిన మహనీయులు ఎందరో ఉన్నారు. అందులో ప్రధానంగా ప్రస్తావించాల్సిన వారు పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం బాలసుబ్రమణ్యం. ఈ ముగ్గురు గాన గంధర్వులు కూడా రామదాసు కీర్తనలను ఆలపించి రామ భక్తులకు మేలు చేశారు. ముందుగా చెప్పాలంటే రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఒక ఆడియో ద్వారా ఆల్బం చేసి తమ గాత్రంతో జీవం పోసి రామదాసు కీర్తనల్లో ఉన్నటువంటి రామ భక్తి మాధుర్యాన్ని రామ భక్తులకు అందించారు.

ప్రభాత, ఏకాంత సేవలు గానం చేసిన మంగళంపల్లి

భద్రాద్రి రామయ్యకు ప్రభాత, ఏకాంత సేవలను డాక్టర మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానం చేశారు. అంతకు ముందు ఆయన భక్తరామదాసు కీర్తనలను జన బాహుల్యంలోకి తీసుకెళ్లారు. అదిగో భద్రాద్రి గౌతమి, ఇదిగో చూడండి పలుకే బంగారమాయనే, నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి ఇలా ఎన్నో అజరామరమైన కీర్తనలు రామ భక్తుల పెదవులతో ఆలపిస్తున్నారంటే అది మంగళంపల్లివారి చలువే. 1972లో తొలిసారి భద్రాచలం వచ్చిన ఆయన ఆనాడు దేవస్థానం ఆధ్వర్యంలో ముక్కోటిని పురస్కరించుకొని నిర్వహించిన వాగ్గేయకారత్సవల్లో పాల్గొన్నారు. అలాగే 2011 ఫిబ్రవరి 10న మళ్లీ భద్రాచలం వచ్చిన మంగళంపల్లి భద్రాద్రి దేవస్థానం ఆస్థాన విద్వాంసులుగా బాధ్యతలు స్వీకరించారు. ఆనాడు సకల కళాపరిపూర్ణ దాశరథి, శ్రీరామం సదా భజేహం తదితర కీర్తనలను ఆలపించి భక్తిసాగరంలో భక్తులను ముంచారు.

నవరత్న కీర్తనల మాలికను రూపొందించిన నేదునూరి సంగీత కళానిధిగా కీర్తించబడే నేదునూరి కృష్ణమూర్తి తొలి నుంచి జీవిత చరమాంకం వరకు భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. అంతేకాదు తన శిష్యగణానికి సైతం వాటి ప్రాధాన్యతను తెలిసేలా ఆయన కృషి చేశారు. ఇదే సమయంలో ఎక్కడ తన కచేరి నిర్వహించినా రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపించని సందర్భం లేదంటే అతిశయోక్తి కాదు. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకరంగా నిర్వహించే వాగ్గేయకారోత్సవాల సమయంలో వయోభారాన్ని సైతం మరిచి తన శిష్యగణంతో వచ్చి రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపించారు. తన ఆరాధ్య దైవమైన రామయ్యకు త్యాగరాజస్వామి వారి పంచరత్న కీర్తనలు మాదిరిగా తన ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యకు రామదాసు రూపొందించిన కీర్తనల్లో నుంచి నవరత్న కీర్తనల మాలికను ఏర్పాటు చేశారు.



గానం చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం



నేదునూరి కృష్ణమూర్తి...

బాలునోట రామదాసు కీర్తనలు

ప్రముఖ సినీ నేపధ్య గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం సైతం భక్తరామదాసు కీర్తనలకు ఎంతో ప్రాధాన్యమిచ్చి గానం చేశారు. దశాబ్దాలు గడిచినా నేటికి బాలు నోట నుంచి వచ్చిన రామదాసు కీర్తనలు అలవోకగా రామ భక్తులు ఆలపిస్తుంటారు. అలాగే 2000-2001 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారుల కృషితో భక్తరామదాసు ప్రాజెక్టుకు ఆయన రామదాసు కీర్తనలను ఆలపించి బహుళ ప్రచారానికి దోహదపడ్డారు.

కలగానే లెదర్‌పార్క్

- ఎస్సీ నియోజకవర్గంలో వారికే ఉపాధి కరవు
- సాకారం కాని నేతల హామీలు
- స్థలం కేటాయించి రెండు దశాబ్దాల పైనే
- పూర్తికాని దళితుల ఉపాధి పథకం

మధిర, ఏప్రిల్ 14: ఖమ్మం జిల్లాలోని చర్మకారులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో 22 ఏళ్ల క్రితం మధిర మండలం మడుపల్లిలో లెదర్‌పార్కు నిర్మాణానికి నిర్ణయించింది. అందుకుగానూ 2002లో 26ఎకరాల స్థలాన్ని కేటాయించారు. సర్వే అనంతరం లిడ్‌కాప్(లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు కేటాయించిన ఆస్థలం అప్పగిస్తూ 2003లో అప్పటి జిల్లా కలెక్టర్ అరవింద్‌కుమార్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. లిడ్‌కాప్ ఆస్థలాన్ని స్వాధీనం చేసుకొని అందులో బోర్డు ఏర్పాటు చేసింది. ఆతర్వాత ఆ పార్కు నిర్మాణంపై ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపించలేదు. దీంతో రెండు దశాబ్దాలు దాటినా లెదర్ పార్కు నిర్మాణం కలగానే మిగిలిపోయింది. ప్రజాప్రతినిధులు దళితులు ఉన్నా, మధిర ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నా ఫలితం కనిపించడం లేదు. దళితులకు ప్రయోకజనం చేకూర్చే లెదర్ పార్క్ గురించి ఎవరూ పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు.



మడుపల్లిలో లెదర్ పార్కుకు కేటాయించిన 26 ఎకరాల స్థలం

133మంది సభ్యులు..

లెదర్‌పార్క్ కోసం మండలంలోని చిలుకూరు, మధిర, మడుపల్లి, దెందుకూరు, రాయపట్నం, మాటూరు, ఇల్లూరు, సిరిపురం, నిధానపురం, మల్లారం, ఆత్కూరు, నాగవరప్పాడు, దిడుగుపాడు గ్రామాలకు చెందిన 133మంది సభ్యులను ఎంపిక చేశారు. వీరంతా సభ్యత్వాలు తీసుకొని ఆ వచ్చిన రూ.1.5లక్షలను బ్యాంకులోనూ జమచేసి సంఘంగా ఏర్పడ్డారు. వీరంతా 2013లో సొసైటీని కూడా రిజిస్ట్రేషన్ చేయించారు. జిల్లా పరిశ్రమల శాఖలో అంబేద్కర్ లెదర్ ఇండస్ట్రీరియల్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించారు. సొసైటీ సభ్యుల్లో ఇప్పటికే 9మంది లెదర్ పార్క్‌ను చూడకుండానే కన్నుమూశారు.

ఆక్రమణలు..

మడుపల్లిలో లెదర్‌పార్కుకు కేటాయించిన 26ఎకరాల భూమిని పలువురు ఆక్రమించారు. వారికి గతంలో ఓ ఎంఆర్‌వో ఎసైన్ పట్టాలు కూడా ఇచ్చారు. దాంతో సర్వేకు కూడా కూడా అధికారులు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. సభ్యులంతా సరిహద్దు ఏర్పాటు చేసుకున్నా.. ఆక్రమణదారులు పూడ్చేశారు.

ఆక్రమణలు ఉంటే చర్యలు తీసుకుంటాం..
వెంకటేశ్వర్లు, తహసీల్దార్

లెదర్‌పార్కు స్థలం ఇటీవల రెవెన్యూ సర్వేయర్లతో సర్వేచేశాం. గతంలో కొంత మందికి ఎసైన్డ్ ఇచ్చారు. అవన్నీ పరిశీలించాలి. సర్వే రిపోర్టు ఇంకా రాలేదు. రిపోర్టు రాగానే ఆక్రమణలు ఉంటే చర్యలు తీసుకుంటాం.

పార్కు నిర్మిస్తేనే ఉపాధి..
కటుకూరి శ్యామారావు, సొసైటీ అధ్యక్షుడు

లిడ్‌కాప్‌కు ప్రభుత్వం అప్పగించిన స్థలాన్ని కొందరు ఆక్రమించారు. ఈస్థలాన్ని అధికారులు సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలి. పార్కు నిర్మాణం జరిగితే జిల్లాలో అందరికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

ప్రజా ప్రభుత్వమైనా స్పందించాలి
పార్శపు మేరి, రాయపట్నం

22 సంవత్సరాలనాడే ప్రభుత్వం భూమి అప్పగించింది. అప్పుడే పరిశ్రమ నిర్మిస్తామని చెప్పటంతో ఎంతో సంతషించాం. కాని ఇంత కాలం అయిన ఇంతవరకు పార్కు జాడలేదు. తెలంగాణలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించాలి.

మెడికల్ కళాశాల స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 14: ప్రభుత్వ వైద్య కళాశాల శాశ్వత భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాన్ని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం పరిశీలించారు. సుమారు 40 ఎకరాల్లో బల్లెపల్లి, రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలో నూతన వైద్య కళాశాల నిర్మించనున్న స్థలాన్ని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించాలని సూచించారు. ఇక్కడ నిర్మాణాలతో ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. నిర్మాణ ప్లాన్‌లో కళాశాల భవనాలు, విద్యార్థుల హాస్టల్ భవనాలు, అధ్యాపకుల క్వార్టర్స్ లను పరిశీలించారు. హైవేకు కళాశాల ప్రధాన భవనం ఎదురుగా కనిపించేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ కలియతిరిగి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రాజేశ్వర రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్యామ్ ప్రసాద్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, తహసీల్దార్లు సీహెచ్ స్వామి, విల్సన్, అధికారులు తదితరులు ఉన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

వృక్ష, జంతువులకు రక్షణ కల్పించాలి

- వరంగల్ సీసీఎఫ్ బీమా నాయక్

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 14: అడవుల్లో ఫైర్‌లైన్ ఏర్పాటుచేసి వృక్ష, జంతువులకు రక్షణ కల్పించాలని వరంగల్ సీసీఎఫ్ భీమా నాయక్ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన ఆకస్మికంగా సత్తుపల్లి డివిజన్‌లో పర్యటించి పెనుబల్లి మండలం పల్లెవాడ సమీపంలోని గొల్లగూడెం, సత్తుపల్లి మండలంలో చెరుకుపల్లి నర్సరీ, మునిసిపాలిటీలోని నీలాద్రి అర్బన్ పార్క్‌లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్లాంటేషన్ కోసం నేలను తయారు చేయాలని, మొక్కలను సైతం హరితహారం కోసం సిద్ధం చేయాలని సూచించారు. వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, సాసర్‌రింగ్స్ ఏర్పాటుతో పాటు ఉన్నవాటిలో జంతువుల కోసం ట్యాంకర్ల ద్వారా సమృద్ధిగా నీటిని నింపాలని ఆదేశించారు. వేసవిలో కార్చిచ్చు బారినపడి అటవీ సంపద బుగ్గిపాలు కాకుండా సమీపంలోని ప్రజలకు అడవుల సంరక్షణ, ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జంతువులను వేటాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట డీఎఫ్‌వో సిద్దార్థ విక్రంసింగ్, ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత, వైల్డ్ లైఫ్ ఎక్సపర్ట్ దీపక్, డీఆర్‌వోలు, ఎఫ్‌ఎస్‌వో, ఎఫ్‌బీవోలు, ఇతర అధికారులు ఉన్నారు.



పార్క్‌ను పరిశీలిస్తున్న భీమా నాయక్

బొగ్గు ఉత్పత్తిలో సత్తుపల్లిదే అగ్రస్థానం

- కొత్తగూడెం ఏరియాలో ఉత్పత్తిలో రికార్డు
- లక్ష్య సాధనలో సత్తుపల్లి గనులు ప్రధాన భూమిక

సత్తుపల్లి, ఏప్రిల్ 13: రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనుల్లో సింగరేణి కొత్తగూడెం ఏరియా రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధిస్తోంది. అందులో ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ-2, కిష్టారం ఓపెన్ కాస్టుల్లో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఏడాదికేడాది ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తూనే రాష్ట్రంలో ఉన్న కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, ఆర్‌జీ-1, ఆర్‌జీ-2, ఆర్‌జీ-3, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి మొత్తం పది ఏరియాల్లో 19 బొగ్గు గనుల్లో కొత్తగూడెం ఏరియా అగ్రస్థానంలో ఉంది. 700లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగ్గా అందులో 138లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి కొత్తగూడెం ఏరియా నుంచి వచ్చింది. పది ఏరియాల్లో కొత్తగూడెం అగ్రస్థానంలో నిలిచేందుకు సత్తుపల్లిలోని ఓపెన్ కాస్టులు పోటీ పడుతున్నాయి. సత్తుపల్లిలో 2007లో సింగరేణి ఓపెన్ కాస్టులు ప్రారంభమయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం కొత్తగూడెం ఏరియాలో 129.5లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా 138లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి (107శాతం) సాధించింది. ఇదీ కొత్తగూడెం ఏరియాలో రికార్డు ఉత్పత్తే.

బొగ్గు ఉత్పత్తి ఇలా...

కొత్తగూడెం ఏరియా పరిధిలో 2023-24లో కొత్తగూడెంలో పీవీకే-5 భూగర్భ గని నుంచి నాలుగున్నర లక్షల టన్ను బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా 2.7లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. వెంకటేష్ ఖని అనుమతులు పొందాల్సి ఉంది. సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ-2లో 100లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పెట్టుకొని 110 లక్షల టన్నులను ఉత్పత్తి చేశారు. కిష్టారం ఓపెన్ కాస్టు పరిధిలో 24లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నూరు శాతం ఉత్పత్తి సాధించింది. గత ఏడాది (2022-23) కొత్తగూడెం ఏరియాలో మొత్తం 128లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా 140లక్షల టన్నుల ఉత్పత్తి సాధించారు. పీవీకే-5 నుంచి అయిదు లక్షల టన్నుల ఉత్పత్తికి లక్ష్యానికిగాను 2.12 లక్షల టన్నులు, జీకే నుంచి 5లక్షల టన్నులకు గాను 5.88 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ నుంచి 100లక్షల టన్నులకు గాను 100లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, కిష్టారం ఓపెన్ కాస్టు నుంచి 20లక్షల టన్నులకు గాను 20లక్షల టన్ను బొగ్గు ఉత్పత్తి జరిగింది.



సత్తుపల్లిలోని ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని

రవాణాలోనూ అగ్రస్థానం

ఉత్పత్తి అయిన బొగ్గును రవాణా చేయటంలో కూడా అధికారులు రికార్డు సృష్టించారు. కొత్తగూడెం ఏరియా పరిధిలో 2023-24లో రవాణా లక్ష్యం 129.5లక్షల టన్నులు కాగా 152.85లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశారు. సత్తుపల్లి ఓపెన్ కాస్టుల నుంచి రైల్వే ద్వారా సగటున రోజుకు ఏడు ర్యాక్స్ బొగ్గు రవాణా జరుగుతోంది. రోడ్డు మార్గంలో ఆరు వేల టన్నుల రవాణా సాగుతోంది. కిష్టారం ఓపెన్ కాస్టులో జీ-8, జీ-13, జేవీఆర్ ఓసీ నుంచి జీ-8, జీ-9, జీ-13, జీ-15, పీవీకే 5 నుంచి జీ-6 రకం బొగ్గు ఉత్పత్తి చేసి రవాణా చేస్తున్నారు.

149.5లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం

2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి మొత్తంగా 720లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. కొత్తగూడెం ఏరియా 149.5లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. పీవీకే-5 నుంచి 3.05లక్షలు, త్వరలో ప్రారంభం అవుతుందని అంచనా వేస్తున్న వెంకటేష్ ఖని నుంచి పది లక్షల టన్నుల బొగ్గు, సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ నుంచి 112లక్షల టన్నులు, కిష్టారం ఓపెన్ కాస్టు నుంచి 24లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. లక్ష్యానికి మించి ఉత్పత్తి సాధించాలనే పట్టుదలతో సత్తుపల్లిలోని అధికారులు శ్రమిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లో
నలుగురి అరెస్టు



సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 14: సత్తుపల్లిలోని ఓ కొబ్బరి తోటలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఇద్దరు మైనర్లతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 11.30గంటల సమయంలో సత్తుపల్లి మండలంలోని సత్యంపేటలో ఏగోటి పెద్దిరాజుకు చెందిన కొబ్బరి తోటలో కొందరు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సమయంలో అక్కడున్న ఇద్దరు మైనర్లతో పాటు అశ్వారావుపేటకు చెందిన ఆకుల శేఖర్, ఆకుల వెంకీ అలియాస్ వెంకటేశ్వరరావు మొబైల్‌లో క్రికెట్ చూస్తూ ల్యాప్‌టాప్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. దాంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే వారిలో ఉన్న ఇద్దరు మైనర్లు తాము క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఏగోటి పెద్దిరాజు వద్ద అసిస్టెంట్లుగా పనిచేస్తున్నామని తెలపగా మరో ఇద్దరు బెట్టింగ్ చేసేవారని తేలడంతో అందరినీ అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి ఒక ల్యాప్‌టాప్, నాలుగు సెల్‌ఫోన్స్, ఒక నోట్‌బుక్‌తో పాటు రూ.13,260నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

అడుగంటిన నేలబావులు

- పూర్తిస్థాయిలో పడిపోయిన భూగర్భ జలం
- పాడి పోషణ, గృహావసరాలకు తప్పని నీటి కష్టాలు
- వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తరలిస్తున్న వైనం
- కల్లూరు మండలంలో అల్లాడుతున్న పల్లె జనం

కల్లూరు, ఏప్రిల్ 14: ఎండలు మండుతున్నాయి. మరో వైపు భూగర్భ జలాలు అడుగంటి పోయే దశకు చేరుకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పల్లెల్లో గృహఅవసరాలు, పాడిపోషణకు తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామాల్లో రైతువారి కుటుంబాల్లో బావులు ఉంటాయి. వర్షా కాలంలో సమృద్ధిగా వర్షాలు ఉంటే వేసవిలోనూ ఆయా బావుల్లో నీరు సమృద్ధిగా లభిస్తుంది. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా వర్షాలు కురవకపోవటంతో ఈ వేసవి ప్రారంభంలోనే పల్లెల్లోని నేలబావుల్లో నీరు (భూగర్భ జలాలు) అడుగంటి పోయింది. దీంతో పాడి పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతుకుటుంబాలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉండగా ముఖ్యమంగా కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. ప్రజలు వ్యవసాయం కోసం పొలాల్లో వేసిన బోరు బావుల నుంచి నేరుగా పైపులు ఏర్పాటు చేసుకొని ఇళ్లల్లోని నేల బావుల్లోకి నీటిని తరలిస్తూ తమ అవసరాలను తీర్చుకోవడమే కాకుండా పశువులకు తాగునీరు అందిస్తున్నారు. గోపాలదేవబోయినపల్లి గ్రామంలో సుమారు 100 కుపైగా నేలబావులు అడుగంటిపోయాయి. దాంతో వ్యవసాయ బోర్లనుంచి సుమారు 50నుంచి 70(1 కిమీ దూరం) పైపులు వేసి నీటిని తరలిస్తున్నారు. రోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం మరో గంట పాటుగా బోరుబావుల నుంచి ఇళ్ల వద్ద ఉన్న నేలబావుల్లోకి నీటిని తరలిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు లేకపోవటంతో సాగర్ జలాలు కూడా రాకపోవంటంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు మార్చి ఆరంభం నుంచే తగ్గిపోయాయి. ఇక మేలో దారుగబంజరు, చిన్నకోరుకొండి, చంద్రుపట్ల తదితర గ్రామాల్లో బోరుబావుల్లో నీరు అడుగంటి పోయే పరిస్థితి ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి వర్షాకాల సీజన్ ప్రారంభం వరకు కొనసాగే అవకాశం ఉందని, వరుణ దేవుడు కరుణించే వరకు నీటి కష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అందని భగీరథ నీరు

కల్లూరు పంచాయతీ పరిధిలోని గోపాలదేవబోయిన పల్లి గ్రామంలో ఓ వీధివైపు గల ప్రజలకు పూర్తి స్థాయిలో సంత్సరాల తరబడిగా భగీరథ నీరు అందడం లేదు. దీంతో ఆ వీధిలో పాడి పోషణపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 30 కుటంబాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. వీరందరు నేల బావుల ఆధారంగానే జీవనం గడుపుతున్నారు. ప్రస్తుతం ఆ బావులు అడుగంటిపోవడంతో వారు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భగీరథనీరు అందిస్తే కొంత వరకు గృహ అవసరాలకు నీటి కష్టాలు తప్పే అవకాశాలు ఉన్నాయి.

వీవీసీ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం

- డిప్యూటీ సీఎం భట్టి, రాష్ట్ర మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 14: వంకాయలపాటి వీరయ్యచౌదరి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీకి ఏళ్ల నాటి అనుబంధం కొనసాగుతోందని, వీవీసీ సంస్థల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగించటం ఆదర్శనీయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. వంకాయలపాటి వీరయ్య చౌదరి 25వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పలు ప్రాంతాలకు పార్థీవ వాహనాలను, తాగునీటి సరఫరా ట్యాంకర్లను ప్రారంభించి మాట్లాడారు. వీరయ్యచౌదరి ఆదర్శలను కొనసాగిస్తూ సామాజిక బాధ్యతగా అనేక సేవా కార్యక్రమాలు రూపొందించటం హర్షణీయమన్నారు. వీవీసీ సంస్థల ఛైర్మన్ రాజేంద్రప్రసాద్(రాజా) మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంబులెన్స్‌లలో వెంటిలేటర్ సౌకర్యాలను అందించేందుకు కార్యాచరణ చేశామన్నారు. ఖమ్మంలో ఏడాదికి 150 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

'రైతు బంధు' విడుదల చేయాలి: పోతినేని

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 14: అనావృష్టితో తీవ్ర వ్యవసాయ ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఉప శమనం కోసం తక్షణమే రైతు బంధు నిధులు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పోతినేని మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయానికి అనుకూలంగా సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేయటం ద్వారా సాగునీటి సమస్యలు తీరుతాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. ధాన్యంలో తేమ, తాలు నేపంతో ప్రభుత్వ మద్దతు ధరను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. పత్తి విత్తనాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, చింతనిప్పు చలపతిరావు, బక్కసాని గంగాధర్, ఎస్‌కే మీరా, దుగ్గి కృష్ణ, శీలం పకీరమ్మ, బొంతు సమత, తుశ్లూరి రమేశ్, మందా సైదులు, రావుల రాజబాబు, కొల్లేటి ఉపేందర్, మల్లేంపాటి రామారావు, శీలం సత్యనారాయణరెడ్డి, మల్లేల మన్మధరావు, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

» ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్14 ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే పాఠశాలల్లో విద్యార్థుల చేరిక శాతాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల ఎన్రోల్మెంట్ జిల్లా వర్క్‌షాపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం ఆందోళనకరంగా మారిందన్నారు. ప్రస్తుతం ఉన్న వసతులు, టీచర్లతోనే నమోదు ఎంచుకొనే అవకాశాలు చూడాలన్నారు. తరగతికి ఒక గది, ఒక టీచరు, ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రజలు డిమాండ్ చేసే విధంగా ఉండాలని, దానికి అవసరమైన కార్యాచరణ చేపట్టాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను అవసరం ఉన్న చోట ఉన్నత పాఠశాలలుగా అభివృద్ధి చేయాలన్నారు. అవసరం లేనిచోట ప్రాథమిక పాఠశాలలో నమోదు పెరిగితే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు కిషోర్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాపులో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. కృష్ణ, ఉపాధ్యాక్షులు వి. వరలక్ష్మి, కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం వెంకటేశ్వర్లు, పద్మా, రాణి, తావురియ్యా, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు వ్యాపిస్తున్న గంజాయి

» రహదారుల వెంట మందుబాబుల మకాం... వీరంగం » భయభ్రాంతులకు గురవుతున్న ప్రయాణికులు



మత్తు పదార్థాల వినియోగం ప్రతి పల్లెలోను కనిపిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ గంజాయి లభ్యం కావడంతో యువత మత్తుకు బానిసలై పోతున్నారు. మత్తు పదార్థాలకు బానిసలై పల్లెల్లో రహదారుల వెంట వీరంగం సృష్టిస్తున్నారు. ప్రయాణికులను బెదిరిస్తూ, దాడులకు దిగుతున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పల్లెల్లో గంజాయి ముఠాలను అరికట్టి, నిఘాను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

అశ్వారావుపేట, ఏప్రిల్14: గంజాయితో పాటు పలురకాల మత్తు పదార్థాల వాడకం, అమ్మకాలు నియోజకవర్గ వ్యాప్తంగా యథేచ్ఛగా నడుస్తున్నాయి. మత్తు పదార్థాల వినియోగం ప్రతి పల్లెలోను కనిపిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ గంజాయి లభ్యం కావడంతో యువత మత్తుకు బానిసలై పోతున్నారు. మత్తులో పలు అసాంఘిక కార్యక్రమాలు, తగాదాలకు పాల్పడుతున్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి ప్రాంతాల్లో పలువురు వ్యక్తులు గంజాయిని తెచ్చి ప్యాకెట్ల రూపంలో జోరుగా అమ్మకాలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్, భద్రాచలం, ఏపీలోని నర్సీపట్నం, రంపచోడవరం ఆటవీ ప్రాంతాల నుంచి అశ్వారావుపేట పరిసరాల్లోని జంగారెడ్డిగూడెం, చింతలపూడి ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులతో పాటు అశ్వారావుపేట పట్టణం కేంద్రంగా కూడా కొందరు వ్యక్తులు గంజాయి విక్రయాలను నడుపుతున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం పట్టణంలోని కొందరు యువకులు, మహిళలు గంజాయిని విక్రయిస్తున్నవారిని పట్టుకొని కేసులు పెట్టిన విషయం అందరికి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి వచ్చి ఆటవీ ప్రాంతంలో ఉంటున్న వారు, పట్టణంలోని కొంత మంది మహిళలు గ్రామాల్లో తిరుగుతూ చిన్న చిన్న సామాన్లు విక్రయించే మహిళలు గంజాయిని ప్యాకెట్లు రూపేణ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు పెద్ద ఎత్తున గంజాయిని దిగుమతి చేసుకొని చిన్న చిన్న వ్యక్తుల ద్వారా గ్రామాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం.

వాహనాలను అడ్డంగా ఉంచి, బెదిరిస్తున్న యువకులు

పట్టణంతో పాటు పల్లెల్లో సైతం పలువురు యువకులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి పోతున్నారు. అశ్వారావుపేట నుంచి భద్రాచలం వెళ్లే రహదారిలో, కామయ్యపాలెం రహదారిలో, మందలపల్లి వెళ్లే రోడ్డులో, వినాయకపురం నుంచి అంకంపాలెం వెళ్లే రహదారుల వెంట, పల్లెల్లో గ్రామ శివారుల్లోని చప్టాలు, కల్వర్టులు, పంట పొలాలల్లో కొందరు మందు బాబులు నిత్యం మకాం వేస్తున్నారు. గుంపుగుంపులుగా చేరి మద్యం సేవించి, వీరంగం సృష్టిస్తున్నారని సమాచారం. వీరిలో చాలా మంది గంజాయి, ఇతర రకాల మత్తు పదార్థాలను విచ్చలవిడిగా వాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చీకటి పడుతుందంటే మార్గమధ్యలో ఎక్కడ పడితే అక్కడ యువకులు గుంపులుగా చేరి గంజాయి, మద్యాన్ని సేవిస్తున్నారు. దీంతో రోడ్డుపై మహిళలతో కలిసి ప్రయాణం చేయాలంటే బెంబేలెత్తి పోతున్నారు. సాధారణంగా ప్రయాణికుల వాహనాలకు అడ్డం తగిలి వాగ్వాదాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పట్టపగలే పట్టణంలో కొందరు యువకులు గంజాయి మత్తులో రోడ్డుకు అడ్డంగా వాహనాలను ఉంచి, అరగంటకు పైగా ట్రాఫిక్‌ను నిలిపివేయడమే కాకుండా రోడ్డుపై వచ్చే వాహనదారులపై తిరిగి బెదిరింపులకు పాల్పడ్డ సంఘటన జరిగింది. ఇటీవల వినాయకపురం-అంకంపాలెం రహదారిలో కొందరు యువకులు రహదారి పక్కనే మకాం వేసి గంజాయి, మద్యం మత్తులో వీరంగం చేసిన సంఘటన జరిగింది. అటుగా కుటుంబంతో సహా వెళ్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని ఆపి వారిపైకి దౌర్జన్యానికి పాల్పడడంతో, బాధితులు ఫోన్ ద్వారా పరిసరాల్లోని గ్రామాలకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్థులు అక్కడికి వెళ్లడంతో ఆ యువకులు నెమ్మదిగా జారుకున్నట్టు చెబుతున్నారు. ఇలాంటి సంఘటనలు పోలీసులు, మీడియా దృష్టికి రానివి నిత్యం ఎన్నో జరుగుతున్నాయి. వీటిపై పోలీసులు ఇప్పటికైనా నిఘాను పెంచి రహదారుల వెంట ముఠాలుగా ఉంటున్న వారిని వాటిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా ఏర్పాటు చేస్తాం: సీఐ జితేందర్‌రెడ్డి

పట్టణంలో ఇప్పటి వరకు ఇటువంటి సంఘటలపై సమాచారం లేదు ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. దీనిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి నియంత్రిస్తామని ఆయన అన్నారు.

హోటళ్లు, లాడ్జీలలో విస్తృత తనిఖీలు

● సీపీ సునిల్‌దత్



ఓ హోటల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఖమ్మంలో హోటళ్లు, లాడ్జీలల్లో తనిఖీలు చేపడుతున్నట్లు సీపీ సునిల్‌దత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు తీసుకునే చర్యల్లో భాగంగా ఖమ్మం పోలీసు కమిషనరేట్ వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఖమ్మం కమిషనరేట్‌లోని శనివారం అర్థరాత్రి అన్ని హోటళ్ల, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులు, సరైన పత్రాలు లేకుండ బస చేసిన వారిని గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. బస చేసేవారి ఆధార్‌కార్డులు ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని హోటల్, లాడ్జీల యజమానులకు సూచించారు. సీసీ కేమేరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మైనర్లకు గదులు ఇవ్వకూడదన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్, కారు ఢీ: ముగ్గురికి గాయాలు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 14: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ కారును ట్రాక్టర్ ఢీకొనగా కారులో ఉన్న ముగ్గురికి గాయలైన సంఘటన ఆదివారం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ చెందిన కారులో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని తీసుకొని ఖమ్మం వస్తూ ఉండగా నగర శివారులోని ఓ డాబా వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో రాంగ్ రూట్లో వచ్చిన ట్రాక్టర్ కారును ఢీకొట్టింది. కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఆ కారులో దుర్గాప్రసాద్ లేకపోవడంతో ప్రమాదం నుంచి ఆయన బయటపడ్డారు. ఈ ఘటనపై కారు డ్రైవర్ మహమ్మద్ జుబేర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

వైన్‌షాపుల్లో చోరీ

బూర్గంపాడు, ఏప్రిల్ 14: బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో గల వైన్‌షాపులలో శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నగదు దొరకకపోవడంతో షాపులోని కొంత మద్యాన్ని ఎత్తుకెళ్లినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు. కాగా చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ టీవీలలో నమోదయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి విచారణ చేపట్టారు.

గొలుసు చోరీకి యత్నించిన వ్యక్తి కోసం పోలీసుల గాలింపు



చోరీకి యత్నించిన వ్యక్తి

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 14: నగరంలోని రోటరీనగర్‌కు చెందిన కుమిలి మంగమ్మ అనే వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీకి యత్నించిన వ్యక్తి కోసం టుటౌన్ పోలీసులు గాలిస్తున్నారు. సంఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న పలు ఇండ్లలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా పోలీసులు నిందితుడి పొటోను విడుదల చేశారు. ఎవరైనా గుర్తిస్తే 87126 59110, 87126 59105 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. వివరాలు తెలిపన వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.


నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

దమ్మపేట, ఏప్రిల్14: నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన అల్లిపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గంగులగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి నాగరాజు(34) కొందరితో కలిసి అల్లిపల్లి గ్రామంలో కొబ్బరి బొండాల కోతకు వెళ్లాడు. ఈక్రమంలో అతడు మంచినీటి కోసం అదేతోటలో ఉన్న కుంట వద్దకు వెళ్లగ, ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. ఎంతసేపటికి అతడు రాకపోవడంతో తోటి కూలీలు కుంట నీటిలో పరిశీలించగా అందులో మునిగిపోయి ఉన్నాడు. అతడిని బయటకు తీసి చూడగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడు తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కాల్వలో జారిపడి వృద్ధురాలు..

పాల్వంచ, ఏప్రిల్ 14: ప్రమాదవశాత్తు కాల్వలో జారి పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పాల్వంచలో ఆదివారం చోటు చేసుకుంది. పాతపాల్వంచ మసీదుగుట్ట ప్రాంతంలో నివాసముంటున్న భూక్యా చిలకమ్మ(60) ప్రమాదవశాత్తు ఉదయం ఇంటి పక్కనే ఉన్న కాల్వలో జారిపడింది. మద్యం మత్తులో ఉండటంతో లేవలేక పోయింది. కొంతసేపటి తరువాత స్థానికులు గమనించి ఆమెను బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉంది. మృతురాలి కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ బానాల రాము తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి....



ఉపేందర్

బూర్గంపాడు, ఏప్రిల్ 14: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన కర్రి ఉపేందర్ (35) అలియాస్ ఉప్పులు అనే వ్యక్తి భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఉంటు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత పనుల మీద ఈ నెల 10న భద్రాచలం నుంచి లక్ష్మీపురం వెళ్లెందుకు భద్రాచలంలో ఆటో ఎక్కిన్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో సారపాకలోని ఐటీసీ కర్మాగారం సమీపంలో ఆటో డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో ఆటోలో నుంచి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు అన్నయ్య కర్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న యయాతి నాటకం



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

మధిర, ఏప్రిల్ 14: హైదరాబాద్ ఫిలింనగర్‌లో శనివారం రాత్రి జరిగిన ఉగాది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మధిర కళాకారులు ప్రదర్శించిన యయాతి పౌరాణిక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకొని ప్రశంసలు పొందింది. పొత్తూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో సుమిత్రా యూత్ అసోసియేషన్ రంగస్థల కళాకారులు గయోపాఖ్యానం యుద్దసీనులో శ్రీకృషుడిగా ఎన్.రవికుమార్, అర్జునుడిగా నీటిపూడి రంగారావు, యయాతిగా చిలువేరు శాంతయ్య, వృషపర్వుడిగా డా.నిబానుపూడి సుబ్బరాజు, శుక్రచార్యుడిగా ఇనుపనూరి వసంత్‌కుమార్, మంత్రిగా పంచాది రమణారావు, శర్మిష్టగా నంది అవార్డు గ్రహీత లహరి, దేవయానిగా అమృతవర్షిణి, యదువుగా అద్దంకి కృష్ణ, పూరుడుగా కిషోర్‌రెడ్డి, సింగన్నగా నరాల సాంబశివారెడ్డి, గంగన్నగా రాజేందర్, తర్వసురుడుగా సందర్‌నాయక్, వృద్ధ యయాతిగా వడ్డి సుర్యప్రకాశ్ తదితరులు నటించారు.

ఎన్నికల సహాయక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

» కలెక్టర్ వీపీ గౌతమ్



కలెక్టరేట్‌లో ఎన్నికల సహాయక కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 14: సాధారణ లోకసభ ఎన్నికల సహాయక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన లోకసభ ఎన్నికల సహాయక కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. లోకసభ ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థుల కోసం ఈ సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేం ద్రంలో ఎన్నికల సంఘం రూపొందించిన నామినేషన్ పత్రా లు అభ్యర్థులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కలెకర్ వెంట అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు ఉన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

క్రీడలతోనే స్నేహభావం

● జిల్లా కాంగ్రెస్ నాయకుడు దయాకర్‌రెడ్డి

కూసుమంచి, ఏప్రిల్ 14: క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా స్నేహభావం పెంపొందుతుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు, మంత్రి పొంగులేటి క్యాంపు ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీరామ నవమి పురస్కరించుకుని కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామంలో పొంగులేటి యువసేన ఆధ్వర్యంలో అంతర్‌జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు మృతి

చింతకాని, ఏప్రిల్ 14: చింతకాని మాజీ ఎంపీపీ, మంత్రి పొంగులేటి అనుచరుడు నారపోగు వెంకటేశ్వర్లు(58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కోట రాంబాబు, పాశం సంజీవరెడ్డి, అంబటి వెంకటేశ్వర్లు, కిలారు మనోహర్‌బాబు, కొప్పుల గోవిందరావు, సామినేని రామారావు, మడుపల్లి గోపాలరావు, దూసరి గోపి, కొల్లి ఉపేందర్, మందడపు శ్రీను, ఆలస్యం రవి, వత్సవాయి జానకిరాములు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్ల మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

» ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 14: మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారు చూపిన మార్గంలో నడవాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెకర్లు వీపీ గౌతమ్, ప్రియాంకలు ఆకాంక్షించారు. ఆదివారం ఆయా జిల్లాలో నిర్వహించిన డాక్టర్. బీఆర్ అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. చాలా దేశాల్లో రాజ్యాంగం కొత్త తరాలకు కాలం చెల్లినదిగా మారడంతో తిరిగి కొత్త రాజ్యాంగానికి రూపకల్పన చేశారని, మన భారతరాజ్యాంగం నేటికి అనుసరణీయంగా దిక్సూచిగా ఉందన్నారు. రాజ్యాంగం మేరకు కొత్త రాష్ట్రాలు, తెలంగాణ ఏర్పాటు జరిగిందన్నారు. అంబేద్కర్ గొప్ప మేధావి అని, రాజకీయవేత్త, సామాజికవేత్త, ఆర్థికవేత్త, గొప్ప స్కాలర్ అని కొనియాడారు. ఆయన ఎన్నో పుస్తకాలు రచించారని, విషయ పరిజ్ఞానంలో ఎంతో లోతుకు వెళ్లి, పరిశోధన చేసేవారని, అందరికి అర్థం అయ్యేలా ఆయన రచనలు ఉంటాయని అన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రతి సంవత్సరం అంబేద్కర్ రచించిన ఒక పుస్తకం చదవాలని అనుకున్నానని, దీనిని అమలుచేస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ జీవితమే ఒక సందేశమని ఆయన అన్నారు. చిన్నతనంలో తాను పడ్డ కష్టాలు మరొకరు పడకూడదని, రాజ్యాంగంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని అన్నారు. చాలా దేశాల్లో ఇప్పటికి అందరికి ఓటుహక్కు లేదని, రాజ్యాంగం లోనే అందరికి సమానత్వం, అందరికి ఓటుహక్కు కల్పించారని అన్నారు. కుల, మత, ధన, అక్షరాస్యత అని ఎలాంటి బేధాలు లేకుండా అందరికీ ఓటుహక్కు కల్పించబడిందన్నారు. రాజ్యాంగం మనకు హక్కులతో పాటు బాధ్యతలు ఇచ్చిందన్నారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మనం రాజ్యాంగం మేరకు నడుచుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఖమ్మం అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సత్యనారాయణ, పాల్గొన్నారు.

భద్రాద్రిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్వో రవీంద్రనాద్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి అనసూర్య, బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిరా, మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారి సంజీవరావు, ఏవో గన్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రిలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రియాంక



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్, అధికారులు

కులబహిష్కరణ చేశారని మహిళ ఆత్మహత్యాయత్నం

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 14: తమను కుల బహిష్కరణ చేశారని మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాయుడుపేట గ్రామానికి చెందిన చెరుకూరి మరియమ్మ కుటుంబ పంచాయతీకి సంబంధించిన విషయంలో వారితో పాటు మరో ఆరుకుటుంబాలను ఇటీవల కుల పెద్దలు కులం నుంచి బహిష్కరించారు. వారి కుటుంబాలతో ఎవరు మాట్లాడొద్దని, వారితో ఎలాంటి సంబంధాలు నిర్వహించొద్దని కుల పెద్దలు తీర్పు చెప్పారు. అయితే ఆదివారం ఆమె చర్చికి వెళ్తున్న క్రమంలో ఇంటి చుట్టు పక్కల వారిని పిలిచింది. దీనికి వారు మీతో మేము మాట్లాడవద్దని మా కుల పెద్దలు చెప్పారని తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కటుంబ సభ్యులు ఆమెను వెంటనే 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త ఉమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుల పెద్దలు అయిన రాధాకృష్ణ, అబ్రహం, వెంకటేశ్వర్లు, సురేష్, ఇజ్రాయిల్, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

యువకుల హల్‌చల్

● ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్14: మద్యం మత్తులో ఇద్దరిపై భౌతిక దాడికి పాల్పడిన ఘటనలో ముగ్గురు యువకులపై పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన గణపవరపు రమేష్ పెద్దమ్మగుడి వద్ద ఓ శుభకార్యం చేసుకుంటున్నాడు. అదే ప్రాంతంలో కొత్తగూడేనికి చెందిన పొన్నం కోటేష్, చీమకుర్తి సాంబమూర్తి, గాదే సాయినిఖిల్ మరి కొందరు యువతీ యువకులతో కలిసి గెట్‌టూ గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో వారు మద్యం సేవించి రమేష్, అతని మరదలు కటారపు రాణిలతో ఎటువంటి కారణం లేకుండానే వాగ్వాదానికి దిగి, భౌతికదాడికి పాల్పడ్డారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ రాములు తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, ఏప్రిల్ 14: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సీతారాంపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం గ్రామానికి చెందిన చిన్నం కోటేశ్వరరావు (40)కు భార్యతో కొంత కాలంగా మనస్పర్థలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆమె తన తల్లి వద్దనే పిల్లలతో కలిసి ఉంటుంది. ఈ నేపథ్యంలో అతడు మద్యానికి బానిసై శనివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. తన సోదరుడు కేశవరావు అన్న ఆచూకీ కోసం ప్రయత్నించగా ఇంట్లో మృతి చెంది ఉన్నాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు దమ్మపేట ఎస్‌ఐ చీమ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అనారోగ్యంతో మరొకరు ..

కామేపల్లి, ఏప్రిల్ 14: అనారోగ్యం కారణం, ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆతహత్య చేసుకున్న సంఘటన కామేపల్లి మండలం హరిచ్చంద్రాపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అజ్మీరా రాంబాబు (48)అనే రైతు అనారోగ్య సమస్యతోపాటు, ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఉన్నాడు. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఫైనాన్షియర్స్ ఇళ్లపై దాడులు

పాల్వంచ, ఏప్రిల్ 14: పాల్వంచలోని వివిధ ప్రాంతాల్లో ఫైనాన్షియర్స్ ఇళ్లపై పాల్వంచ పట్టణ పోలీసులు శనివారం అర్థరాత్రి దాడులు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఐదుగురి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి కొంత నగదు, విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై టౌన్ ఎస్‌ఐ బానాల రామును వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇద్దరు బాలురు అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 14: ఇద్దరు బాలురు అదృశ్యంపై ఖమ్మం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన దుబ్బలి భాగ్యమ్మ పనులపై ఖమ్మం నగరంలో నివాసముంటుంది. కాగా ఈనెల 11న భాగ్యమ్మ తన ఇద్దరు పిల్లలు దుబ్బలి మహేంద్ర(14), దుబ్బలి శివకేశవ(9)లతో కలిసి తన స్వగ్రామానికి వెళ్లేందుకు ఖమ్మం రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లింది. కాగా రైలు ఆలస్యం కావడంతో స్టేషన్ సమీపంలో రామాలయం గుడి పక్కన వంట చేసుకుంటూ ఉండగా, పిల్లలు ఇద్దరు ఎక్కడికో వెళ్లారు. దీంతో వారి కోసం పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్14: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. ఖమ్మంరూరల్ మండలం దానవాయిగూడేనికి చెందిన గుగులోత్ తరుణ్ (25) డెంటిస్టుగా చదువుతున్నాడు. శనివారం రాత్రి దానవాయిగూడెం నుంచి ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌కు తన మిత్రులతో కలిసి బయలుదేరి వెళ్లి వస్తుండగా, తిరుమలాయపాలెం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కూతురు వరుసైన బాలికతో పెళ్లి

» నిందితుడిని అరెస్టు చేసిన చంద్రుగొండ పోలీసులు

చంద్రుగొండ, ఏప్రిల్ 14: కూతురు వరుసైన బాలికను(17)వివాహ చేసుకున్న వ్యక్తిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ మాచినేని రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుగొండ మండలంలోని ఒక గ్రామంలో వివాహితుడైన సాంబశివరావు అనే వ్యక్తి కూలీపనులు చేసుకుంటూ నివాసం ఉంటున్నారు. అతడి భార్యకు ఒక అక్క ఉండగా ఆమె తన మొదటి భర్తనుంచి విడాకులు తీసుకొని మరో పెళ్లి చేసుకొని భర్తతో కలిసి మరో మండలంలోని ఓ గ్రామంలో ఉంటోంది. అయితే ఆమెకు తన మొదటి భర్తతో కలిగిన కూతురును చంద్రుగొండ మండలంలోని తన తల్లి ఇంటి వద్ద ఉంచి పాఠశాలకు పంపుతోంది. కాగా బాలిక నివాసం ఉంటున్న ఇంటి సమీపలోనే బాలిక చిన్నమ్మ ఇల్లు ఉంది. దాంతో సదరు బాలిక తరచూ చిన్నమ్మ ఇంటికి వెళుతూ ఉండేది. ఈ క్రమంలో చిన్నమ్మ భర్త సాంబశివరావు బాలికను లైగికంగా వేదిస్తుండేవాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు గతంలోనే సాంబశివరావుని మందలించారు. అయితే ఈ నెల 6న సాంబశివరావు సదరు బాలికను తీసుకొని వెళ్లి జిల్లాలోని ఓ పట్టణంలోని గుడిలో వివాహం చేసుకుని అక్కడ నుంచి హైదరాబాద్ తీసుకెళ్లాడు. తరువాత ఈ నెల 13న స్వగ్రామానికి తీసుకొచ్చాడు. దాంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీకున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

మణుగూరు, ఏప్రిల్ 14: మణుగూరు మండల పరిధిలోని పాత మల్లెపల్లి గ్రామ శివారులో గల గోదావరి ఒడ్డున ఆదివారం ఓ మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం గుర్తించలేనిదిగా ఉండడంతో వివరాల కోసం ఆరా తీశారు. కాగా మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బండ సాయికుమార్ (25) ఆచూకీ మూడు రోజుల నుంచి లభించడం లేదని కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం.. ఆ గుర్తు తెలియని మృతదేహం సాయికుమార్‌గా పోలీసులు గుర్తించారు. అతడితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు గోదావరి ఒడ్డున మద్యం సేవించేందుకు వెళ్లినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పాల్వంచ, ఏప్రిల్ 14: పాల్వంచ ముర్రేడువాగు నుంచి పట్టణంలోకి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ బానాల రాము తెలిపారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18K. Ph: 9160900024, 9640400073
AJH-002188

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా పమ్పించబడిన / క్లెయిమ్స్‌కు, దత్త వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

స్వదేశాగమనము/ విదేశీయానం, పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం, షష్టిపూర్తి, లీగల్ నోటీసులు, శ్రద్ధాంజలి, పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347



అశ్వాపురంలో 'పాయం' పర్యటన



అశ్వాపురం, ఏప్రిల్ 14: మండలంలో ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈసందర్భంగా శుభకార్యాలలో పాల్గొని ఆశీర్వాదాలు అందజేశారు. మండల పరిధిలోని మొండికుంలో ఇటీవల ప్రమాదానికి గురైన చిన్నారి జెట్టి రోహిత్‌ను పరామర్శించి కుటుంబసభ్యులను ప్రమాద వివరాలను అడిగితెలుసుకున్నారు. పాములపల్లిలో కొమరం నరేష్ , పార్వతి దంపతుల కుమార్తె గీతిక ఓణీల అలంకరణ కార్యక్రమంలో గీతికను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, ఎంపీటీసీలు కమటం నరేష్, గాదె జయ, ఏనిక రవి, బేతం రామకృష్ణ, సొసైటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

రాజ్యాంగ నిర్మాతకు ఘనంగా నివాళులు

ఆశయాలు సాధించాలని వక్తల పిలుపు

కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు

భారత రాజ్యాంగ నిర్మాత డా బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని వక్తలు కోరారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



'పేట'లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జారే



మల్లెమడుగులో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నివాళి



పట్వారిగూడెంలో ఎమ్మెల్యే జారే నివాళి



మణుగూరులో నివాళి అర్పిస్తున్న అయోధ్య



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావ్



నివాళి అర్పిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు



కార్యక్రమంలో ఇల్లెందు మునిసిపల్ చైర్మన్



కొత్తగూడెం కాంగ్రెస్ కార్యాలయంలో



సీపీఎం ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న సింగరేణి అధికారులు



కరకగూడెంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేగా



మణుగూరు కోర్టులో...



టీఎన్‌జీవో ఆధ్వర్యంలో..



జూలూరుపాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



కొత్తగూడెం 'బార్' ఆధ్వర్యంలో..



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు చిన్ని



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో..



మాట్లాడుతున్న హెవీ వాటర్ ప్లాంట్ జీఎం



బూర్గంపాడులో

అగ్నిమాపక సేవలు అమోఘం

ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్తగూడెం డీఎస్పీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 14: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సత్వరంగా అగ్నిమాపక శాఖ అందిస్తున్న సేవలు అమోఘమని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఆదివారం ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అగ్ని నివారణ చర్యలు చేపట్టేందుకు, దేశ సంపదను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరమూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రజలను అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరంతరం అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండి సేవలను అందిస్తున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. ముఖ్యంగా అడవులు అగ్నికి ఆహుతి అవుతున్న సమయాల్లో, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించినప్పుడు వారు సుదూర ప్రాంతాలకు వెళ్ళి త్యాగాలతో కూడిన సేవలను అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా వరదలు సంభవించినప్పుడు, రైలు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర ప్రమాదాలలో వారు సాహసోపేతంగా స్పందిస్తూ వారి ప్రాణాలను పనంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ అగ్ని మాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్ జీపుల్లయ్య, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు దస్తగిరి, హెడ్‌కానిస్టేబుల్ షేక్ సైదులు, కానిస్టేబుల్‌లు శ్రీనివాసరావు, సురేష్, ప్రతాప్‌రెడ్డి, శివకృష్ణ, ఎం.ప్రతాప్,కార్తీక్, తదితరులు పాల్గొన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఈ వారోత్సవాలలో వేరు వేరు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు ఈ వారం రోజుల పాటు నిర్వహిస్తామని ఫైర్ ఆఫీసర్ పుల్లయ్య తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రెహమాన్

పేటలో అగ్నిమాపక వారోత్సవాలు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద అధికారులు వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 1944లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులు అర్పించారు. అనంతరం సిబ్బంది అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కలిగించారు.

భద్రాచలంలో..

భద్రాచలం: అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున భద్రాచలం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఉద్యోగులకు, ప్రయాణికులకు ప్రమాదాలపై, వారోత్సవాల ప్రాధాన్యతపై వివరించారు. దీనిలో భాగంగా మొదటి రోజు భద్రాచలం బస్టాండ్‌లో ప్రజలను చైతన్య పరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం సిబ్బంది ఏఎల్ఎఫ్ బండారు సతీష్, డ్రైవర్ ఆపరేటర్ కుమారస్వామి, సిబ్బంది శివాజీ, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

ఆ ఇంట ఉద్యోగాల పంట..

» ముగ్గురు అన్నదమ్ములకూ పోలీస్ ఉద్యోగాలే..

» బూర్గంపాడుకు చెందిన ఓ కుటుంబం ఘనత

బూర్గంపాడు, ఏప్రిల్ 14: ఒక కుటుంబంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం రావటమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో... ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు పోలీసు ఉద్యోగాలను సాధించి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇప్పటికే ఇరువురు కుమారులు పోలీసు ఉద్యోగాలు చేస్తుండగా, ఇటీవల విడుదల చేసిన అగ్నిమాపక శాఖ ఫలితాలలో మూడో కుమారుడు కూడా ఉద్యోగం సాధించి పట్టుదలకు ప్రతిరూపంగా నిలిచాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కేసుపాక నాగేశ్వరరావు-రాజ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. పేద కుటుంబానికి చెందిన నాగేశ్వరరావు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ ముగ్గురు కుమారులను ఉన్నత చదువులు చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసిన వారి కుమారులు భాస్కరరావు, ప్రసాద్‌రావు, రఘురామ్ ఎంతో కష్టపడి చదివి పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించి కాలనీ వాసులకు స్ఫూర్తిగా నిలిచారు.

అన్నయ్య లక్ష్యం వైపు..

నాగేశ్వరరావు-దంపతుల పెద్ద కుమారుడు భాస్కరరావు గతంలో పోలీస్‌శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇద్దరు తమ్ముళ్లను పోలీస్ శాఖలోనే ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించాడు. దీంతో పెద్ద తమ్ముడు ప్రసాదరావు సిఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ఒడిశాలో విధులు నిర్వహిస్తున్నాడు. చిన్న తమ్ముడు రఘురామ్ పోలీస్ శాఖలో ఉద్యోగ నియామకాల్లో ప్రయత్నాలు చేసి ఇటీవల విడుదల చేసిన ఫలితాలలో అగ్నిమాపక శాఖలో ఫైర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. కాగా తమ మేనమామ తోకల రాజారామ్ ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండడంతో అదే స్ఫూర్తితో తాము కూడా ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. కాగా, ముగ్గురు అన్నదమ్ములు పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించి కాలనీకి ఆదర్శంగా నిలవడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కుటుంబసభ్యులతో రఘురామ్



రఘురామ్

ఎస్ఐ ఉద్యోగాన్ని సాధిస్తా..

అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్‌గా ఎంపికైన రఘురామ్ మాట్లాడుతూ.. ఎస్ఐ ఉద్యోగం సాధించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపాడు. పోలీస్ శాఖలో పని చేయాలనే చిన్ననాటి కల ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడంతో నెరవేరిందని అన్నారు. తల్లితండ్రుల ప్రోత్సాహం, అన్నయ్యల సహకారంతో పాటు కాలనీ వాసుల ప్రోత్సాహం మరువలేనిదని తెలిపాడు.

బెదిరింపులతో బీఆర్ఎస్ నాయకులను లొంగదీసుకోలేరు: మెచ్చా

అశ్వారావుపేట, ఏప్రిల్ 14: బెదిరింపులతో బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులను లొంగదీసుకోలేరని మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సంక ప్రసాదరావు ఇంటివద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకుడైన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంక ప్రసాదరావుతో పాటు మరి కొందరు వ్యాపారులపై దాడులు చేసి కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇలాంటి చర్యలు ఎప్పుడు జరగలేదని, ఇప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ పాలన అభివృద్ధివైపు సాగితే రేవంత్‌రెడ్డి పాలన ప్రజలను మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నడిచిన సంక్షేమ పథకాలను కూడ ఈ ప్రభుత్వం అమలు చేయలేక పోతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగ విద్యుత్, నీరు లేక పంటలు ఎండి పోతున్నాయని ఆరోపించారు. కాంగ్రేస్ ఆరు గ్యారంటీలను అమలు చేయలేక చతికిలపడిందన్నారు. పేదలకు ఇళ్ళు, ఇంటి స్థలాలు, మహిళలకు తోడ్పాటు వంటివి ఎన్నో ప్రకటించారని, ఆ పథకాలు జాడేదని ఆయన ప్రశ్నించారు. భవిష్యత్ కాంగ్రెస్ ఇంటికేనని, బీఆర్ఎస్‌దే భవిష్యత్ అని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెచ్చా

సకాలంలో ఏర్పాట్లు పూర్తవ్వాలి

ఆర్డీవో దామోదరరావు

దుమ్ముగూడెం ఏప్రిల్ 14: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలలో శ్రీరామనవమి ఏర్పాట్లు ఈ నెల 16లోగా పూర్తవ్వాలని ఆర్డీవోదామోదారావు ఆదేశించారు. స్నాన ఘట్టాల వద్ద షవర్‌బాత్ ఏర్పాటు చేయాలని సూచించారు. టాయిలెట్లు, తాగునీరు, పారిశుద్యం తదితర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అన్నారు. కళ్యాణ మంటపం వద్ద ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎంపీవో ముత్యాలరావు, ఆలయ ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్, గిర్దావర్లు ఆదినారాయణ, లక్ష్మయ్య, ఏఈ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీల ఏర్పాటు

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార కార్యక్రమంతోపాటు ఇతర కార్యకలాపాలు చేపట్టేందుకు ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం కమిటీలను నియమించారు. ఇల్లెందు, బయ్యారం, గార్ల, టేకులపల్లి, కామేపల్లి మండలాలతోపాటు ఇల్లెందు పట్టణ స్థాయిలో కమిటీలను నియమించినట్లు వెల్లడించారు. ఈ కమిటీల ద్వారా కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ ఒక్కరూ విశేషంగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

రామయ్య వివాహ తంతు ప్రారంభం

అశ్వారావుపేట, ఏప్రిల్ 14: అశ్వారావుపేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు అంగరంగవైభవంగా సీతారామ చంద్రస్వామి వివాహ వే డుకలను జరిపేందుకు భక్తులు ఏర్పాట్లు చేసారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని పసుమర్తి చక్రధరరావు ఇంటి వద్దకు సీతారామచంద్రస్వాముల విగ్రహాలను ఊరేగింపుగ తీసుకెళ్ళారు. అక్కడ భక్తులంతా కలి సి పసుపు కొట్టి, పిండిని విసిరి సీతారామ చంద్రస్వాముల వార్లను పెండ్లి కుమార్తె, పెండ్లి కుమార్తులను మేళతాళాల మధ్య వైభవంగా చేసారు. చూసేందుకు తరలివచ్చిన భక్తులందరికి తాంబూలాది సత్కారాలు అందజే సారు. సంప్రదాయ ప్రకారం ఐదురోజుల పాటు జరుగుతున్న ఈ వివాహ వేడుకలను చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు.



పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేసే వేడుక

జాతీయ అథ్లెటిక్స్‌లో రాణించాలి

జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి

పాల్వంచ, ఏప్రిల్ 14 : యువకులు జాతీయ అథ్లెటిక్స్‌లో రాణించాలని జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి అన్నారు. ఆదివారం పాల్వంచ పట్టణ పరిధిలోని శ్రీనివాసకాలనీలోని స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికలలో ముందుగా ఒలంపిక్ జెండా ఊపి పరుగు పందెం పోటీలను ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండను సైతం లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి 200 మంది యువ అథ్లెట్లు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ నాయకులు ఆరెం ప్రశాంత్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహిధర్, జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ కోచ్ నాగేందర్, కోచ్‌లు గిరిప్రసాద్, అక్బర్, నరేష్, దుర్గాప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు జడ్పీటీసీ రాజీనామా

దుమ్ముగూడెం, ఏప్రిల్ 14: దుమ్ముగూడెం జడ్పీటీసీ తెల్లం సీతమ్మ ఆదివారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. చినబండిరేవులో బీఆర్ఎస్ ఎంపీటీసీ, మాజీ సర్పంచిలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అడుగుజాడల్లో నడవాలని తీర్మానించారు. ఆయన వెంటే తాము నడుసత్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎంపీటీసీ తిరుపతిరావు, మాజీ సర్పంచిలు మట్టా వెంకటేశ్వరావు, జయమ్మ, నాయకులు ఏ శ్రీదర్, జీరి సత్యనారాయణరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి జన్మదినం



అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు, ఏప్రిల్ 14: మండలంలోని పలు గ్రామాలలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాలలో అయ్యప్ప భక్తులు ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భజనలు చేశారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వెంగన్నపాలెంలో భక్తులకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు. సూరారం, కాకర్ల, పాపకొల్లు గ్రామాలలో అయ్యప్ప భక్తులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో గురుస్వాములు నేరెళ్లకుంట శ్రీనివాసరావు, యలబాక రాంబాబు, అనుమళ్ళ భద్రయ్య, బండారు వెంకటేశ్వర్లు, మహంకాళీ గోపాలకృష్ణ, చిలుకూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అయా ప్రాంతాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన ట్రైకార్ జీఎం

దుమ్ముగూడెం ఏప్రిల్ 14: గంగోలు కాళికామాత ఆలయాన్ని ట్రైకార్ జనరల్ మేనేజర్ కుంజా శంకర్ ఆదివారం దర్శించుకున్నారు. ట్రైకార్ పథకంలో అక్కడ ఏర్పాటు చేసిన పాల యూనిట్‌ను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లోని ఆదివాసీ వ్యాపారులకు బ్యాంకు కాన్సెంట్‌కు సంబంధం లేకుండా రూ.50వేల ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు.